తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలి

» ఎంపీ డీకే అరుణ


మహబూబ్‌నగర్ జిల్లా కందూరులో బీజేపీ సభ్యత్వ నమోదు సందర్భంగా మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

అడ్డాకుల, సెప్టెంబరు 9 : కార్యకర్తల నిరంతర కృషితో హరియాణాలో అనూహ్య విజయం సాధించిన స్ఫూర్తితో తెలంగాణలో కూడా వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు బీజేపీని అధికారంలోకి తేవాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పిలుపునిచ్చారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల పరిధిలోని కందూరులో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేసిన తర్వాత ఆమె మాట్లాడారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కహామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని చెప్పారు. పార్టీ పదవులు కోరేవారు, స్థానిక ఎన్నికల్లో నిలిచేవారు విధిగా వంద మందితో సభ్యత్వం చేయించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కోరారు. దేశానికి రక్షణ బీజేపీతోనే ఉంటుందని ప్రజలు గుర్తించి నరేంద్రమోదీని బలపరుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గట్టు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాలరాత్రీ దేవి అలంకరణలో అమ్మవారు

అలంపూరు/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 9: దసరా శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూరులో జోగుళాంబ, ఉమామహేశ్వర క్షేత్రంలో భ్రమరాంబ అమ్మవార్లు ఏడో రోజు బుధవారం కాలరాత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలంపూర్‌లో జోగుళాంబకు దర్బారు సేవ, కొలవు, సువాసిని కుమారి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథంలో ఉంచి, ఆలయ ప్రాకారం చుట్టూ తిప్పారు. సెలవులు ఉండటంతో ఉమామహేశ్వరంలో భ్రమరాంబ, ఉమామహేశ్వరుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

చిరుత అనుమానాస్పద మృతి

కొల్లాపూర్, అక్టోబరు 9: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నల్లమల అడవుల్లో చిరుత పులి అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం సృష్టించింది. మండల పరిధిలోని అమరగిరి రహదారిలో కొల్లాపూర్ మునిసిపాలిటీ డంపింగ్ యార్డు దాటిన తర్వాత రోడ్డుకు సమీపంలో గండి వద్ద చిరుత పులి మృతి చెందినట్లు గ్రామస్థులు గుర్తించారు. ఆ ప్రాంతంలో దుర్గంధం వస్తుండటంతో పరిశీలించగా మృతి చెందిన పులి కనిపించింది. దాంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ ఘటనా స్థలానికి చేరుకొని, పులి కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. తర్వాత కాల్చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ చిరుత పులి వయస్సు పెద్దదేనని, అది అనారోగ్యంతో మరణించిందా? లేదంటే ఎవరైనా దుశ్చర్యకు పాల్పడ్డారా? అనే విషయమై విచారణ చేపడతామన్నారు. చిరుత మరణించి దాదాపు మూడు నుంచి నాలుగు రోజులు అయి ఉంటుందని అటవీ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక మృతికి కారణాలు తెలుస్తాయన్నారు. కొల్లాపూర్ నల్లమల్ల అడవుల్లో అటవీశాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఏడు చిరుత పులులు సంచరిస్తున్నట్లు తాము గుర్తించామని చెప్పారు. నిత్యం పర్యాటకులు సంచరించే అమరగిరి రోడ్డుకు సమీపంలో చిరుత పులి మరణించడం పర్యాటకుల్లో భయాందోళన నెలకొంది. ఇదిలా ఉండగా నల్లమల పరిసర ప్రాంతాల్లో అడవి పందుల బారి నుంచి పంటల రక్షణ కోసం కొందరు రైతులు చుట్టూ విద్యుత్ తీగ కంచె ఏర్పాటు చేస్తున్నారు. దాంతో పాటు పంటలలో చీడపీడల నివారణ కోసం ఉపయోగించే గుళికల మందులు కూడా వన్య ప్రాణుల ప్రాణాలను హరిస్తున్నాయి. అటవీ అధికారులు వాటిని నివారించి, వన్య ప్రాణులను రక్షించాల్సి ఉంది.

సూపర్ స్పెషాలిటీ

- పాలమూరులో 80 శాతం పూర్తయిన నూతన ఆస్పత్రి నిర్మాణం
- రూ.178.30 కోట్లతో 1,003 పడకలు
- 5 బ్లాకులుగా వర్క్స్
- అత్యాధునిక హంగులు, భద్రత, నాణ్యతా ప్రమాణాలతో వార్డులు, గదులు
- డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు సన్నాహాలు


మహబూబ్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) అక్టోబరు 9: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 1003 పడకలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉస్మానియా ఆస్పత్రి స్థాయిలో చేపడుతున్న దీనికి రూ.178.30 కోట్ల నిధులను కేటాయించారు. ఐదు బ్లాకులు, ఆరు అంతస్తులుగా నిర్మిస్తున్న ఈ దవాఖానాలో ఐదో బ్లాకులో ఈవీఎం భవనం ఉండటంతో దానికి కేంద్రం నుంచి అనుమతుల దృష్ట్యా ఆలస్యం అవుతోంది. అది మినహాయించి 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ భవనం అంతా అత్యాధునిక హంగులు, భద్రత, నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

16.4 ఎకరాల్లో..

ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఉస్మానియా ఆస్పత్రిగా చెప్పుకునే స్థాయిలో 1003 పడకల ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. జిల్లా కేంద్రం నడిబొడ్డున పాత కలెక్టరేట్ స్థలంలో 16.4 ఎకరాలను ఆస్పత్రి నిర్మాణం కోసం కేటాయించారు. ప్రస్తుతం ఎనిమిది ఎకరాల్లో ఆస్పత్రి నిర్మాణం సాగుతోంది. మిగతా స్థలంలో భవిష్యత్‌లో పీజీ హాస్టల్ భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.178.30 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఐదు బ్లాకుల్లో 1003 పడకలకు సంబంధించి నిర్మాణాలు చేపడుతున్నారు. లోపల వార్డులు, గదుల నిర్మాణాలు పూర్తవగా, బయట ఎలివేషన్ పనులు చేపడుతున్నారు. రోజూ 400 నుంచి 500 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా తెలంగాణతో పాటు ఛత్తీస్‌గడ్, ఒడిశా, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు. వారితో పాటు 30 మంది ఇంజనీర్లు, 30 మంది సూపర్‌వైజర్లు, 24 మంది సెక్యూరిటీ గార్డులు పని చేస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలకు ప్రత్యేక విభాగం..

ఈ నిర్మాణాలలో ఉపయోగించే వస్తు సామగ్రి నాణ్యత, ప్రమాణాలు చూసేందుకు ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఇంజనీరు కూడా ఉంటారు. ఇసుక, సిమెంటు, స్టీలు, ఇంకా ఏ ఇతర నిర్మాణ సామగ్రి నాణ్యతను చూసేందుకు ఆ విభాగంలో యంత్రాలు ఉన్నాయి. వాటి ఆధారంగా ఆ వస్తువు ఎంత నాణ్యతగా ఉందో తెలుస్తోంది.

అత్యాధునిక హంగులు..

అత్యాధునిక హంగులు, మౌలిక వసతుల నిర్మాణ పనులు చేపడుతున్నారు. భవనంలో పూర్తిగా సెంట్రల్ ఏసీతో పాటు సెంట్రల్ ఆక్సిజన్ సిస్టమ్, అత్యాధునిక అగ్నిప్రమాదాల నివారణ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు సంభవించినా రోగులు, డాక్టర్లు, సిబ్బందికి ప్రాణనష్టం కలుగకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంటుకు కూడా అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

5 బ్లాకులు.. 6 అంతస్తులు..

ఆస్పత్రి భవనం గ్రౌండ్ ఫ్లోర్‌తో కలుపుకొని మొత్తం ఆరు అంతస్తుల్లో ఐదు బ్లాకులుగా నిర్మాణాలు చేపడుతున్నారు.

- గ్రౌండ్ ఫ్లోర్‌లో అన్ని విభాగాలకు సంబంధించిన ఓపీడీ గదులు, వేయిటింగ్ హాల్, ఫార్మసి, రిజిస్ట్రేషన్, స్టోర్స్, రక్తనమూనాల సేకరణ, రేడియాలజీ, సిటి స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రే విభాగాలు ఉండనున్నాయి.
- అంతస్తులో సూపర్ స్పెషాలిటీకి సంబంధించిన ఓపీడీ విభాగాలు, మెడికల్ ఎమర్జెన్సీ, ఐసీయూ, ట్రయాజ్ వార్డులు, ట్రామా సెంటర్‌లు, బ్లడ్ బ్యాంకు, సెంట్రల్ ట్యాబు, క్యాత్ ల్యాబ్, క్యాత్ వార్డు, ఐసీయూ ఏర్పాటు చేయనున్నారు.
- రెండో అంతస్తులో జనరల్ మెడిసిన్ వార్డులు, డిపార్ట్‌మెంట్ గదులు, బర్న్ వార్డు, టీబీ, సీడీ వార్డులు, సైకియాట్రిక్, చర్మవ్యాధుల వార్డులు ఉంటాయి.
- మూడో అంతస్తులో జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఆప్తాల్మిక్ వార్డులు, డిపార్ట్‌మెంట్ గదులు ఉండేలా చూస్తున్నారు.
- నాల్గో అంతస్తులో ఆపరేషన్ థియేటర్లు, పోస్టుఆపరేటిక్, అనెస్తీషియా రికవరీ వార్డులు, సీఎస్ఎస్‌డీ, ఎస్‌ఐసీయూ, ఐసీసీయూ ఉండనున్నాయి.
- ఐదో అంతస్తులో మాత్రం హాస్పిటల్ స్టోర్స్ అడ్మినిస్ట్రేషన్, సెమినార్ హాల్, ఎంఆర్‌డీ, లెక్చర్ గ్యాలరీ, అకాడమిక్ బ్లాకును ఏర్పాటు చేస్తున్నారు.

ఆ బ్లాకు నిర్మాణంలో జాప్యం..

ఆస్పత్రి ఐదో బ్లాకు నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయి. ఆ బ్లాకు పక్కన పాత కలెక్టరేట్‌కు సంబంధించిన ఈవీఎం భవనం ఉంది. ఆ బ్లాకు పూర్తి కావాలంటే ఈవీఎం భవనాన్ని కూల్చాల్సి ఉంది. కానీ ఆ గదిలో ఒక నియోజకవర్గానికి సంబంధించిన బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి. తీయాలంటే కేంద్రం అనుమతి తప్పనిసరి. అందువలన ఆ ప్రాంతంలో నిర్మాణాలు జాప్యం అవుతున్నాయి. ప్రస్తుతానికి 80 శాతానికి పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



ఊరేగింపుగా వస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, అక్టోబరు 9 : మండలంలోని కొల్లూర్ గ్రామంలో గ్రామదేవత పోచమ్మకు గ్రామస్థులు బుధవారం బోనాలు కార్యక్రమం నిర్వహించారు. ఎద్దుల బండ్లతో ఊరేగింపు నిర్వహించి బోనం కుండలలో తయారు చేసిన నైవే ద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను తమ గ్రామాన్ని సల్లంగా సూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంచికంటి సౌజన్యరఘు గుప్త, లక్ష్మీనర్సింహరాజు, మాజీ ఉపసర్పంచ్ నర్సింహచారి, సుదీర్‌రెడ్డి, సేవ్యనాయక్, వాసుయాదవ్, మహ్మద్‌ఖాజ షైనోద్దిన్, లంబ వెంకటయ్య, జెట్టిగారి కృష్ణయ్యగౌడ్, దక్షిణమూర్తి, కృష్ణయ్య, వెంకటయ్య, గోపాల్‌గౌడ్, సత్యనారా యణ గౌడ్, నాగ అంజయ్య సున్నాల కృష్ణయ్య, ప్యాట గోపాల్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ నుంచి 170 మంది హజ్‌యాత్రకు ఎంపిక

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 9 : హజ్‌యాత్ర-2025కు సంబంధించి మహబూబ్ నగర్ జిల్లా నుంచి 170 మందికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్‌లో గల జిల్లా హజ్‌సొసైటీ కార్యాలయంలో ఎంపికైన హజ్‌యాత్రీకులకు మెడికల్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తులను అందజేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ మూద్‌అలీ, మెహరాజ్ మాట్లాడుతూ హజ్‌యాత్రకు వెళ్లేందుకు ఎంపికైన వారు సంబం ధిత పత్రాలను అందజేయాలని సూచించారు. ఎంపికైన వారు మొదటి విడతలో రూ. 1,30,300 చెల్లించాల్సిన ఉంటుందని, పూర్తి వివరాల కోసం జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు రజాక్, ఖాజా నిజాముద్దీన్, రహెమాన్, అర్షద్‌అలీ పాల్గొన్నారు.

మంచి నీరు వృథా కాకుండా చూడాలి

▸▸ జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి

జడ్చర్ల, అక్టోబరు 9 : గ్రామ పంచాయతీలలో తాగు నీరు వృథా కాకుం డా చూడాలని, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి సూచించారు. జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధ వారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో జడ్పీ సీఈఓ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణ, గ్రామ పంచాయతీలలో వీధిదీపాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. జడ్చర్ల ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో సరోజ, ఈజీఎస్ ఏపీఎం విజయభాస్కర్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి, అక్టోబరు 9: కల్వకుర్తి పట్టణంలోని నాగర్‌కర్నూల్ రోడ్డులో అక్రమంగా బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారని పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాఘవేందర్‌రెడ్డి, కల్వకుర్తి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. బొలెరో వాహనంలో 21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

ఈ క్షణం.. ఆనందదాయకం

కొత్తగా నియామకమైన ఉపాధ్యాయుల భావోద్వేగం

పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎంతో కష్టపడి వారు చదివారు. కొందరు ఉద్యోగాలు చేస్తూ, మరికొందరు గృహిణులుగా ఉంటూ కుటుంబ సభ్యుల సహకారంతో ప్రభుత్వ కొలువు సాధించారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న డీఎస్సీ-2024 అభ్యర్థులు తమ సంతోషాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

కల నెరవేరింది



ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించాలన్నది నా కల. ఆరేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తూ సిద్ధమవుతున్నా. ఇద్దరు చిన్న పిల్లలను చూసుకుంటూనే 2024 డీఎస్సీ కోసం సిద్ధమయ్యాను. నా ప్రిపరేషన్‌లో భర్త శ్రీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులు సహకరించారు.

- ప్రణీత, ఎస్‌జీటీ, ఇటిక్యాల మండలం ఉదండాపురం

రెండో ప్రయత్నంలో..



2017 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించినా.. వెరిఫికేషన్ సమయంలో వెనుకపడాల్సి వచ్చింది. అనంతరం వ్యవసాయ శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసినా తృప్తి లేకపోవడంతో ఎంఈడీ పూర్తి చేసి కొన్నాళ్లపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశా. తిరిగి 2024 డీఎస్సీలో పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నా.

- వినోద్, ఎస్‌జీటీ, పెద్దతాండ్రపాడు, రాజోలి మండలం

కుటుంబ సభ్యుల తోడ్పాటు



2014లో నాన్న మరణానంతరం నా చదువు కోసం టైలరింగ్ చేస్తూ అమ్మ పడిన శ్రమ మరిచిపోలేను. కానిస్టేబుల్‌గా ఎంపికైనా నా తమ్ముడు కుటుంబానికి, నా చదువుకు తన వంతు తోడ్పాటునందిస్తూ బాసటగా నిలిచాడు. వారిద్దరి ప్రోద్బలం, సహాయంతోనే ఉద్యోగాన్ని సాధించుకోగలిగాను.

- ఎం.శివసాయి ప్రసాద్, ఎస్‌జీటీ, గట్టు

చెప్పలేని అనుభూతి



మాది నిరుపేద కుటుంబం, నేను పగలు ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ, రాత్రి సమయంలో ఉద్యోగం కోసం చదువుకునే వాడిని. కొడుకు గ్రూప్ ఉద్యోగం కోసం సిద్ధమయ్యేవాడు. తండ్రీ కొడుకులైన తామిద్దరం నియామక పత్రాలు అందుకోవడంతో మా కుటుంబమంతా సంతోషంగా ఉంది. మా కష్టాలు నేటితో తీరనున్నాయి. - గోపాల్, భానుప్రకాష్, మరికల్

విద్యార్థులకు బోధించాలని..



తాను చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయ వృత్తిలోచేరి బోధన చేయాలన్నది కల. కష్టపడి చదివి ఉద్యోగానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మానాన్న రాజేశ్వర్ జీహెచ్ఎం, మా గురువు డీఈవో రవీందర్ నాకు ఆదర్శం.

- బి.సుమన, ఎస్ఏ గణితం, మహబూబ్‌నగర్

కష్టానికి ఫలితం దక్కింది



ఎస్జీటీగా ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నిరంతరం పడిన కష్టానికి ఫలితం దక్కింది. 2022లో డీఈడీ పూర్తిచేశా. జిల్లా స్థాయిలో ఏడవ ర్యాంకు వచ్చింది. కుటుంబ సభ్యులతో పాటు మిత్రుల సహకారంతో ఈ ఉద్యోగం సాధించా.

- నవీన, ఎస్జీటీ, లక్ష్మీపూర్, నారాయణపేట

కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే..



సమగ్రశిక్షలో కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తూనే.. ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది. స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను ప్రవేశపెట్టడంతో ఈ అవకాశం వచ్చింది. జిల్లా మొదటి ర్యాంకు సాధించా.

- అశోక్‌కుమార్, ఎస్ఏ, స్పెషల్ ఎడ్యుకేషన్, మహబూబ్‌నగర్

కష్టపడినందుకు ఫలితం..



కష్టపడి చదివినందుకు ఫలితం దక్కింది. మహబూబ్‌నగర్ జిల్లా హిందీ పండిత్‌లో నాల్గవ ర్యాంకు వచ్చింది. 14 ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలలతో పాటు, గురుకులాల్లో గెస్ట్ టీచర్‌గా బోధిస్తూ రోజుకు మూడు గంటలు చదివేదాన్ని. భర్త నాగార్జునచారి కృషి ఎంతో ఉంది. జీవితంలో మరిచిపోలేని రోజు.

- లక్ష్మి, హిందీపండిత్, అచ్చంపేట

సంతోషంగా ఉంది



ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. నాకు స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో సీఎం సభలో నియామక పత్రాన్ని తీసు కోవడం చాలా సంతోషంగా ఉంది. ఉద్యోగం రావడంతో చాలా గర్వపడుతున్నా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.

- దొడ్ల నరేష్‌రెడ్డి, చారకొండ

తల్లిదండ్రులకు అంకితం



కష్టపడి ఉద్యోగం సాధించినందుకు సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకపత్రం అందుకోవడం జీవితంలో మరిచిపోలేనిది. సహకరించిన తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. ఈ విజయాన్ని నా తల్లిదండ్రులు భాగ్యమ్మ, శ్రీనివాసులుకు అంకితం.

- ఏదుల మనోజ్‌కుమార్, పెద్దకొత్తపల్లి

అప్పర్‌ప్లాట్ గ్రామాలకు స్వచ్ఛంద పునరావాసం



ప్రజలతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రోహిత్‌గోపిడీ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 9 : నల్లమలలోని అప్పర్‌ప్లాట్‌లో నివసిస్తున్న చెంచులకు స్వచ్ఛంద పునరావాసం కింద మైదాన ప్రాంతమైన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం అడవిలో పునరావాసం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రెండు విడతల్లో మొత్తం 1,167 కుటుంబాలకు బాచారం అడవిలో స్వచ్ఛంద పునరావాసం కల్పించేందుకు అటవీశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. బాచారం వద్ద చెంచులకు పునరావాస కల్పనకు సాధ్య అసాధ్యాలను జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, అధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో పులుల సంతతి పెరగడం, సంచారం ఎక్కువ కావడంతో చెంచుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. దీంతో అటవీ శాఖ అధికారులు ముందుచూపుతో అప్పర్ ప్లాట్ చెంచులకు అనువైన ప్రదేశంగా బాచారం అటవీ ప్రాంతాన్ని గుర్తించింది. అప్పర్‌ప్లాట్ నుంచి సార్లపల్లిలో 25 కుటుంబాలు కుడిచింతలబైలులో 166 కుటుంబాలు, తాటిగుండాల్‌లో 25 కుటుంబాలు, కొల్లంపెంటలో 21 కుటుంబాలు, మొదటి విడతలో 417 కుటుంబాలకు పునరావాసం కల్పించే ప్రక్రియ అంతిమ దశకు చేరింది. ఈ నాలుగు గ్రామాలకు ఎన్‌టీసీఏ ఢిల్లీ కేంద్రం ఇది వరకే ఆమోదించినట్లు డీఎఫ్‌వో తెలిపారు. రెండో విడతలో వటవర్లపల్లి నుంచి 750 కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు ప్రక్రియ మొదలు పెట్టినట్లు చెప్పారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ స్వచ్ఛంద పునరావాసం కింద ఒక్కో కుటుంబానికి ఐదు ఎకరాల భూమి, ఇల్లు, అవివాహిత యువతులకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు, వృద్ధులకు రూ15లక్షలు పరిహారం చెల్లించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో దోమలపెంట ఎఫ్‌ఆర్‌వో గురుప్రసాద్‌సారోడ్, సాతాపూర్ బీట్ ఆఫీసర్ వెంకటేష్, బీట్ ఆఫీసర్లు ధర్మ, శిల్ప, తేజశ్రీ, రాజేశ్వరి, సుమలత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ మరింత బలోపేతం

- నేరాల సంఖ్య తగ్గించేలా చూడాలి
- స్టేషన్ల తనిఖీలో డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్



గద్వాలలో మొక్క నాటి నీరు పోస్తున్న డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్

గద్వాల క్రైం/ఇటిక్యాల, అక్టోబరు 9: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్. ఎస్. చౌహాన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా, డీఎస్పీ కార్యాలయాలు, పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఎస్పీ కార్యాలయంలో నమోదు అయిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో తరుచుగా పోలీస్ స్టేషన్‌లను, సర్కిల్ కార్యాలయాలను సందర్శించి పర్యవేక్షించాలన్నారు. ఎస్‌ఐలతో మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఐదు ఎస్‌ను ఎవరిపరిధిలో వారు నిత్యం అమలు అయ్యేలా చూడాలన్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. మహిళా అధికారులకు రెస్ట్‌రూమ్ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చోరీలు కాకుండా చూడాలన్నారు. 100కు కాల్ వస్తే వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సకాలంలో పరిష్కరించాలన్నారు. రౌడీషీటర్స్, అనుమానితులు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కార్యాలయంలో మొక్కలను నాటారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. కార్యాలయంలోని ఎస్‌బీ, డీసీఆర్‌బీ రికార్డులను, ఏ-సెక్షన్, బీ సెక్షన్, హెడ్ క్వార్టర్స్‌కు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ సత్యనారాయణ, ఏవో సతీష్, సాయుధ దళ డీఎస్పీ నరేందర్‌రావు, సీఐలు ఎస్‌ఐలు ఉన్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంలో అలంపూర్ సర్కిల్ కార్యాలయం, ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌ను డీఐజీ ఎల్ఎస్. చౌహాన్ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రోజు వారు నిర్వహిస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు.

దేవరకద్రకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయండి

- సీఎం రేవంత్‌కు దేవరకద్ర ఎమ్మెల్యే వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్/దేవరకద్ర, అక్టోబరు 9 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గానికి సంబందించిన పనుల కోసం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్కను కలిశారు. నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ పాఠశాలకు ఇప్పటికే భూసేకరణ చేశామని, వివరాలు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని, మొదటివిడతలోనే దేవరకద్రకు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలో కోర్టును ఏర్పాటు చేయాలని, నియోజకవర్గ కేంద్రం ప్రస్తుతం మేజర్ పంచాయతీగా కొనసాగుతుందని దేవరకద్రను మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సీఎం తక్షణమే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

సరిహద్దు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 9: జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ఏపీ వెళ్లే వాహనాలకు సెస్ వసూలు చేసేందుకు మార్కెటింగ్ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం ఉండవల్లి మండలంలోని పుల్లూరు శివారులోని టోల్‌ప్లాజా వద్ద అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ ఎల్లస్వామి, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏపీలోకి వెళ్లే వాహనాలను తనిఖీ చేపట్టారు. ప్రస్తుతం పత్తి ఇంటికి చేరడంతో వ్యాపారులు, దళారులు జిల్లాలోని పలు గ్రామాల్లో కొనుగోలు చేసి తెలంగాణ ప్రభుత్వానికి సెస్ చెల్లించకుండా ఏపీకి తరలిస్తున్నారు. ఈ వాహనాలే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు సెక్రటరీ తెలిపారు. రెండు రోజులుగా పది లారీల నుంచి రూ.68వేలు సెస్ రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు.

పెళ్లి సంబంధం కోసం వెళ్లి వస్తుండగా..

- ఆటో బోల్తా పడి 15 మందికి తీవ్ర గాయాలు




ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

పెబ్బేరు రూరల్, అక్టోబరు 9 : వనపర్తి జిల్లా పెబ్బేరు జాతీయ రహదారిపై రంగాపురం పరిసర ప్రాంతంలో ఆటో బోల్తా పడి 15 మందికి గాయాలైన ఘటన బుధ వారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా చెనుగోనిపల్లికి చెందిన 15 మంది పెళ్లి సంబంధం కోసం వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం ఉప్పరిపల్లికి ఆటోలో బయలుదేరారు. పెళ్లి సంబంధం ఖాయం చేసుకొని తిరిగి వారి గ్రామానికి వెళ్తుండగా.. జాతీయ రహదారి 44 రంగాపురం సమీపంలో ఆటో టైరు పంక్చర్ కావడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో 15 మందిలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రెండు అంబులెన్స్‌లలో క్షతగాత్రులను గద్వాల, కర్నూల్ జిల్లా ఆసుపత్రులకు తరలించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

బిజినేపల్లి, అక్టోబరు 9 : ఒంటరి మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి బుధవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన మహిళతో తిరుపాల్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని బెదిరించాడు. ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులపైనున్న పోలీసు కేసులు మాఫీ చేయండి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 9 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2011 సంవత్సరంలో నిర్వహించిన సకలజనుల సమ్మెలో ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారని ఉద్యమకారులపై పెట్టిన కేసులను రద్దు చేయించాలని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌లకు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆర్.నారాయణ, భగవంతు, బుచ్చన్న, డేవిడ్, రాయాజోద్దిన్, బాల్‌రాజ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు వ్యక్తికి గాయాలు

ఊర్కొండ, అక్టోబరు 9 : బైకును కారు ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ చెందిన ఒర్సు సాయిలు జిల్లెల్ల గ్రామంలో నివాసం ఉంటూ ఊర్కొండ శివారులో కూలీ పనులు చేస్తుండేవాడు. తన పనులు ముగించుకొని బైకుపై రోడ్డు మార్గనా వెళుతుండగా జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైకు వెనకాల నుంచి ఢీకొట్టింది. దీంతో సాయిలుకు తీవ్రగాయాలు కాగా బంధువులు, పోలీసులు కల్వకుర్తి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నిమ్మల దామోదర్‌రెడ్డిగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి..

బిజినేపల్లి, అక్టోబరు 9 : వాకింగ్ చేస్తున్న వారిని తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ చెందిన రామస్వామి పాలెం గ్రామం నుంచి బిజినేపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. పాలెం చెందిన పలువురు తెల్లవారు జామున వాకింగ్ చేసుకుంటూ వెళ్తుండగా వెనుక వైపు నుంచి బైక్ వచ్చిన రామస్వామి వారిని గమనించి తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం ఇచ్చి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

హన్వాడ, అక్టోబరు 9 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని రాంనాయక్‌తండాలో బుధవారం వ్యవసాయ పనులు చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ వెంకటేష్‌నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో భూమి చదును చేశాడు. చదును పూర్తి అయ్యాక పొలం గట్టు దాటుతుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ మధ్య డ్రైవర్ ఇరుక్కుపోయాడు. చుట్టు పక్కల వారు కట్టెలతో ట్రాక్టర్‌ను లేపి డ్రైవర్‌ను బయటకు తీశారు. అతన్ని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

వనపర్తి రూరల్, అక్టోబరు 9 : బావిలో అనుమానాస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిమనగుంటపల్లికి చెందిన ఓ రైతు రోజు మాదిరిగా పొలానికి వెళ్లాడు. ఆ రైతుకు చెందిన బావిలో ఓ మహిళ మృతి చెందినట్లు గమనించి రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఎస్ఐ జలంధర్‌రెడ్డి, సీఐ నాగభూషణరావు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. గోపాల్‌పేట మండలం బుద్దారం గ్రామం ధర్మతండాకు చెందిన పాత్లావత్ శాంతమ్మ (40)గా ఆమెను గుర్తించారు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన శాంతమ్మ రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆ బావి పక్కన మద్యం సీసా, గ్లాసులు, చికెన్ ముక్కలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు చంపేసి వెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలికి భర్త, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్‌ఎస్ఎస్‌తో క్రమశిక్షణ



ఎంపికలను నిర్వహిస్తున్న అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 9: ఎన్ఎస్ఎస్‌తో యువతకు క్రమశిక్షణ అవలడుతుందని పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే రోజు పరేడ్ నిర్వహించడానికి వెస్ట్‌జోన్ ప్రీఆర్‌డీ సెలక్షన్ నిర్వహించారు. యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న అన్ని కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఎంపికలను చేపట్టారు. నవంబర్ 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జల్గాంలో ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొని అక్కడ శిక్షణ పొంది అత్యుత్తమ ప్రదర్శన కనబరిన వలంటీర్లను కేంద్ర కమిటీ ఎంపిక చేసి గణతంత్ర వేడుకల్లో పరేడ్‌లో ప్రదర్శన చేస్తారు.

ప్రతీ మేజర్ పంచాయతీకి ఒక గ్రంథాలయం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లు నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 9 : ప్రతీ మేజర్ గ్రామ పంచాయతీకి ఒక గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యోగార్థులకు పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్‌ను ప్రతీ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచుతామని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లు నర్సింహారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ హాజరై మాట్లాడారు. అంతకుముందు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మల్లు నర్సింహారెడ్డిచేత ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, సీనియర్ నాయకులు సంజీవ్‌ముదిరాజ్, ఎన్‌పీ వెంకటేశ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితామధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, అమరేంద్రరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరాను సంతోషంగా జరుపుకోవాలి

- ఆశ కార్యకర్తలకు చీరల పంపిణీలో ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, అక్టోబరు 9 : దసరా పండగను ప్రతీఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పురపాలిక పరిధిలో పనిచేసే ఆశా కార్యకర్తలకు పండగను పురస్కరించుకుని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో ఆశా వర్కరుల ఎంతో కష్టపడి పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు టంకర కృష్ణయ్య, మోతీలాల్, లతశ్రీ, రబియాఅంజద్, శ్రీనివాస్‌యాదవ్, రఘు, మోయిస్, అజీజ్ పాల్గొన్నారు.

నిండు మనసుల ప్రతిబింబం బతుకమ్మ : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 9 : తెలంగాణ నిండు మనసుల ప్రతిబింబం బతుకమ్మ అని ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాశాల మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల మనోభావాలకు అద్దం పట్టేది మన బతుకమ్మ వేడుకలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ జాజిమొగ్గ, నర్సింములు, స్వప్న, లక్ష్మణ్ యాదవ్ కుమార్, మోతీలాల్, రబియా, అహ్మద్, లత, లక్ష్మణ్ నాయక్, ఖాజాపాషా, బసవరాజ్, వైష్ణవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరహరి, పట్టణ మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● భావితరాలకు అందించాలి : మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని రవీంద్ర నగర్‌కాలనీలో శీతలదేవి అమ్మవారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలతో, ఆయా కాలనీ లకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

అధికారులు శ్రద్ధతో పని చేయాలి : ఎమ్మెల్యే

భూత్పూర్, అక్టోబరు 9 : గ్రామాల అభివృద్ధి విషయంలో గ్రామ స్థాయి అధికారులు శ్రద్ధగా పని చేయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులకు గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకరచారి, ఎంపీవో శ్రీదేవి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'హిందూ మహిళల సంఘటితమే సంస్థ లక్ష్యం'

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 9 : దేశంలో అన్ని ప్రాంతాల హిందూ మహిళల సంఘటిత కోసం రాష్ట్రీయ సేవికా సమితి పనిచేస్తుందని రాష్ట్రీయ సేవికా సమితి పని చేస్తుందని వక్త వక్కలంక మహతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో రాష్ట్రీయ సేవికా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. 1936 ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ హెగ్డే వారు మహిళల సమీకరణ కోసం ఒక కొత్త సంస్థ కావాలని ఈ సంస్థను ప్రారంభించారని వారు అన్నారు. సమితి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 5215 కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. 475 సేవ ప్రాజెక్టుల, గోశాలలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ శిక్షణ ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, దేదీప్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి డీఎస్సీకి ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 9 : ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ కోసం శిక్షణ తీసుకున్న వారిలో 11 మంది అభ్యర్థులు డీఎస్సీకి ఎంపికైనట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కాడం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఐదుగురు స్కూల్ అసిస్టెంట్స్‌గా, ఎస్జీటీలుగా, ఒకరు లాంగ్వేజ్ పండిట్, ఒకరు పీఈటీగా ఉద్యోగాలు సాధించినటు తెలిపారు. వారిని డీడీ సుదర్శన్ అభినందించినట్లు తెలిపారు.

సరస్వతీ దేవిగా అమ్మవారు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ పాలమూరు/ టౌన్/జడ్చర్ల/ దేవరకద్ర/ హన్వాడ/ భూత్పూర్/ మూసాపేట, అక్టోబరు 9 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని వాసవీ మాత ఆలయంలో శ్రీనివాస కాలనీలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో, బస్టాండ్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సరస్వతీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వెండిపోచమ్మ దేవాలయంలో సరస్వతిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీరన్నపేట చౌడేశ్వరి దేవాలయంలో సరస్వతీదేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని కావేరమ్మపేట చావిడి వద్ద అమ్మవారికి కాలనీమహిళలు ఒడి బియ్యం నింపారు. అమ్మ వారికి సరస్వతి దేవీగా అలంకరిం చారు. దేవరకద్ర నియోజకవర్గంలోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. హన్వాడ ఎస్సీ కాలనీలో దుర్గాదేవి విగ్రహానికి బుధవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పూజలు చేశారు. భూత్పూర్ మునిసిపాలిటీలోని అమిస్తాపూర్ గ్రామ శివారులోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. మూసాపేట మండలంలో దుర్గామాతను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు, చేశారు.



సరస్వతీదేవిగా అమ్మవారు



ఏనుగొండ సరస్వతీ ఆలయంలో చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్ సామ్రాజ్య రాజులను ఎదిరించిన ధీశాలి

- ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

- ముఖ్య అతిథిగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

గండీడ్, అక్టోబరు 9 : మొగల్ సామ్రాజ్య రాజులను ఎదిరించిన ధీశాలి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గండీడ్, మహమ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో విలీనం కోసం ముఖ్యమంత్రితో మాట్లాడుతున్నామని తెలిపారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ సంఘ వారికి వైన్స్‌ల లైసెన్స్‌లు పొందేందుకు 15 శాతం రిజర్వేషన్ కోసం ప్రత్యేకంగా కృషి చేశామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, పీసీసీ సభ్యుడు నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప, గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబల నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ శాంతి రంగ్యా, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, మారుతీ కిరణ్, మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, బి.గోపాల్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం అధ్యక్షుడు కోడూరు దస్తయ్య, గీతకార్మికుల సంఘం అధ్యక్షుడు చంద్రయ్యగౌడ్, గౌడ్ సంఘ సభ్యులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, నాయకులు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో కలెక్టర్, అధికారులు



విద్యుత్‌భవన్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో కలెక్టర్, అధికారులు

వైభవంగా బతుకమ్మ సంబురాలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్)/ పాలమూరు/ మహబూబ్‌నగర్ టౌన్/ భూత్పూర్/ మూసాపేట, అక్టోబరు 9 : తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను జిల్లాలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌లు ముఖ్య అతిథులుగా హాజరై బంతిపూల బతుకమ్మకు పూజలు చేశారు. వివిధ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ● జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాల్లో కలెక్టర్ విజయేందిరబోయి, విద్యుత్‌భవన్, డీఈ కార్యాలయం, ఈఆర్ఓ, సర్కిల్ కార్యాలయం, ట్రాన్స్‌కో కార్యాలయంలో పనిచేసే మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. ఎస్.ఈ పి.వెంకటరమేష్,డీఈటీ డి.చంద్రమౌళి, డీఈ వెంకటశివరాం, ఎస్ఏఓ బీచుపల్లి ప్రసంగించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆర్ఎం శ్రీదేవితో పాటు ఉద్యోగులు బతకమ్మలకు పూజలు చేశారు. ● బుధవారం సాయంత్రం భూత్పూర్ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం నుంచి సరఫరా అయిన యూనిఫాములను అందించారు. ● మూసాపేట బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి జి.కవిత పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, నాయకులు నిరంజన్, తాజొద్దీన్, రాంచందర్, మహేందర్, తిరుపతయ్యగౌడ్, నారాయణ, శ్రావన్‌కుమార్, సలాం, శ్రీనివాసులు, లక్ష్మయ్య, షేక్‌పాష, రత్నయ్య, రాజు పాల్గొన్నారు.



భూత్పూర్‌లో బతుకమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్



బస్టాండ్‌లో బతుకమ్మ ఉత్సవాల్లో మహిళా ఉద్యోగులు

మార్కెట్‌కు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

- బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

జడ్చర్ల, అక్టోబరు 9 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి ధాన్యం తీసుకొచ్చే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, మంచి సేవలు అందించేవిధంగా నూతన పాలకవర్గం పని చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బాదేపల్లి మార్కెట్ ప్రాంగణంలో బుధవారం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌కు వచ్చిన రైతులకు సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. వర్షం పడిన సందర్భంలో రైతులు తెచ్చిన ధాన్యం కొట్టుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. నూతన పాలకవర్గం సభ్యులకు పూలమాల, శాలువాతో సన్మానించారు. బాదేపల్లి మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్‌గా జ్యోతిఅల్వాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్‌గా రాజేందర్‌గౌడ్, డైరెక్టర్‌లుగా వన్నం కృష్ణయ్య, ముడావత్ రాజునాయక్, కుర్మిద్దే యాకూబ్, లక్ష్మయ్య, ఖాజాఅలీమొద్దీన్, సత్యనారాయణగౌడ్, నల్ల నారాయణరెడ్డి, కొంగలి యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బంగారయ్య, సునీల్ సాంక్ల, శివ్వ కిశోర్‌లతో జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నవీన్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల్‌రెడ్డి, నిత్యానందం, అశోక్‌యాదవ్, బుర్ల వెంకటయ్య, కాట్రేపల్లి లక్ష్మయ్య, జనార్దన్‌రెడ్డి, వ్యాపార సంఘం నాయకులు ఆలంపల్లి మనోహర్, కెంచె వరుసవేది పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట రుణాలు ఇవ్వాలి : ఎమ్మెల్యే

జడ్చర్ల : జడ్చర్ల నియోజకవర్గంలో రుణమాఫీ పొందిన రైతులందరికీ ఖరీఫ్ పంట రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. జడ్చర్ల ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గస్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. రూ.2లక్షల లోపు మాఫీ కానీ రుణాలు, రూ.2లక్షలకు పైబడి ఉన్న పంట రుణాల రైతుల వివరాలను ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యేలా తాను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. భార్య, భర్తలు వేర్వేరుగా రెండు బ్యాంకులలో రూ.2లక్షలకుపైగా ఉన్న వారికి రుణమాఫీ కాలేదని బ్యాంకర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రూ.2లక్షల లోపు రుణాలు కలిగి ఉన్న వారిలో ఎంత మందికి రుణమాఫీ జరగలేదనే వివరాలు బ్యాంకర్ల వద్ద లేకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ భాస్కర్, ఏడీఏ ఆంజనేయులు, నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ ప్రమాణంలో ఎమ్మెల్యే, పాలకవర్గం, నాయకులు

ఎమ్మార్పీఎస్ నాయకుల ఆందోళన



మహబూబ్‌నగర్‌లో ర్యాలీ చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

పాలమూరు, అక్టోబరు 9 : తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు శ్రీరాములు, రాజు, కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడా రు. సుప్రీంకోర్టు తీర్పుకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొదట తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని అసెంబ్లీలో చెప్పిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఈ మధ్య ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగాలను వర్గీకరణ అమలు చేయకపోవడం వల్ల మాదిగలు, మాదిగ ఉపకులాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణను వేగంగా అమలులోకి తీసుకువచ్చి ఎస్సీలకు న్యాయం చేయాలని సీఎంను కోరారు. కార్యక్రమంలో గణేష్, బత్తిని రాము, టి.జంగయ్య, వినోద్, సురేష్, బాలరాజు, బాలయ్య పాల్గొన్నారు.

శ్వేతారెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జడ్చర్ల, అక్టోబరు 9 : జడ్చర్ల మండలం మాచారం గ్రామంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సతీమణి డాక్టర్ శ్వేతారెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌ను జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మూడు రోజుల పాటు టోర్నమెంట్‌ను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఉపసర్పంచ్ రవి, నాయకులు ప్రణీల్‌చందర్, ఇంతియాజ్‌ఖాన్, శంకర్‌నాయక్, వీరేశ్, కరాటే శ్రీను, చారి, తిరుపతయ్య, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి : పీఆర్‌టీయూ టీఎస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 9 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డీఏలను దసరా కానుకగా ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన బుచ్చారెడ్డి అశ్వని చంద్రశేఖర్, డి.కవిత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, ప్రమీలారాణిలను అభినందించారు.

యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా : సీపీఎం

పాలమూరు, అక్టోబరు 9 : అమెరికా తన లాభం కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలో ఇజ్రాయిల్ దాడులను ఖండి స్తూ మోటార్‌లైన్ ఏరియాలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేడు పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం అప్రజాస్వామికంగా, అన్యాయంగా పాలస్తీనావాసులను 42వేల మంది ప్రజలను చంపిందన్నారు. ఆరు లక్షల మంది గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఇజ్రాయిల్ అహంకారం, దుర్మార్గ విధానాలను ఖండించి పాలస్తీనా ప్రజలకు సంఘీభావం, సానుభూతి తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

హరియాణా స్ఫూర్తితో పని చేద్దాం : డీకే అరుణ



చిన్నచింతకుంటలో మాట్లాడుతున్న ఎంపీ డీకె అరుణ

చిన్నచింతకుంట, అక్టోబరు 9 : హరియాణాలో మూడోసారి పార్టీ విజయం కోసం కృషిచేసిన కార్యకర్తలను స్ఫూర్తిగా తీసుకుని అందరం కష్టపడి పని చేస్తే వచ్చేఎన్నికల్లో తెలంగాణాలోనూ బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన చిన్నచింతకుంటలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మనదేశం, మన ఊరు అభివృద్ధి చెందాలంటే ప్రజలు బీజేపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు కొండా ప్రశాంత్‌రెడ్డి, సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జి నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దశరత్, నాయకులు మంగళి మనోహర్, గుబ్బ శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శులు నరేష్, నరేందర్‌జీ, మాజీ అధ్యక్షుడు రాములు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, నర్సిహులు, రుతుకుమార్, మహేష్ యాదవ్, బాలచందర్ శెట్టి, బాలచంద్రుడు, రవి, రాజు పాల్గొన్నారు.

బాలగోపాల్ ఆశయాలను కొనసాగిద్దాం



బాలగోపాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజలు

పాలమూరు, అక్టోబరు 9 : బాలగోపాల్ ఆశయాలను కొనసాగిద్దామని పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బాలగోపాల్ 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అణగారినవర్గాలకు పీడిత ప్రజల కోసం ఆయన చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయన్నారు. అన్ని రంగాల ప్రజలకు అండగా నిలిచివారి తరపున అనేక పోరాటాలు చేసిన గొప్పవ్యక్తి బాలగోపాల్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బహుజన సమితి అధ్యక్షుడు ఆఆలూరి చెన్నయ్య, రజక పోరాట సమితి అధ్యక్షుడు శివన్న, పాలమూరు లేబర్ సంఘం అధ్యక్షుడు గడ్డమీది గోపాల్, బండారి చెన్నయ్య, బి.వెంకటేశ్వర్లు, అనుప జంగన్న, వెంకటేశ్వర్లు, ఎల్.పెంటయ్య, కళాకారుడు బాలచందర్, పద్మ, నరేష్, బషీర్, సయ్యద్‌అలీలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

జడ్చర్ల, అక్టోబరు 9 : జడ్చర్ల పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో ఓ సర్వీసింగ్ సెంటర్‌లో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. దసరా సెలవులకు జడ్చర్లకు వచ్చిన సదరు యువకుడు బుధవారం సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లాడు. కాగా సెంటర్‌లో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

సమసమాజ స్థాపనే కాన్షీరాం లక్ష్యం

నవాబ్‌పేట, అక్టోబరు 9 : సమసమాజ స్థాపనే కాన్షిరాం లక్ష్యమని డీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి అంబేడ్కర్ అన్నారు. బుధవారం కాన్షిరాం వర్థంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్ర పటానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం కోసం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర పేరుతో పీడిత వర్గాలను ఏకతాటిపై తెచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చెప్పులు కుట్టేవారికి రూ.లక్ష రుణం, టూల్‌కిట్స్ ఇవ్వాలి : కేవీపీఎస్

పాలమూరు, అక్టోబరు 9 : చెప్పులు కుట్టే చర్మకారులకు ప్రభుత్వం అండగా ఉండాలని, వారికి ప్రభుత్వం రూ.లక్ష రుణం, టూల్‌కిట్స్ ఇవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.కుర్మయ్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. బహుళ జాతి కంపెనీల వళ్ల రకరకాల చెప్పులు మార్కెట్లోకి విచ్చలవిడిగా రావడంతో చర్మకారులు తయారు చేసిన చెప్పులకు గిరాకి లేకుండా పోయిందన్నారు. చెప్పులు కుట్టే వృత్తే కనుమరుగయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చర్మకారులు కుట్టే చెప్పులకు మార్కెట్ సదుపాయం కల్పించాలన్నారు. జడ్చర్ల మండలం, పోలేపల్లి సెజ్ దగ్గర ఉన్న లెదర్‌పార్కు పనులు ప్రారంభిస్తే దళిత నిరుద్యోగ యువతకు వేయిమందికి ఉపాధి లభిస్తుందన్నారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు మద్దతు ప్రకటించి ప్రసంగించారు. జడ్పీ నుంచి 16శాతం నిధులు నాలుగేళ్ల నుంచి ఎస్సీ కార్పొరేషన్ చెల్లించవలసిన నిధులు రూ.52లక్షలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. అవి చెల్లిస్తే చర్మకారులకు రుణాలు లభించి అధునాతన పరికరాలు కొనుక్కుని ఉపాధి పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, మహేందర్, మనోహర్, రామచంద్రయ్య, పాలమూరు రాములు, మణ్యంకొండ, రమేష్, బాలరాజు పాల్గొన్నారు.

రెండవ రోజు కొనసాగిన ప్రజావేదిక

హన్వాడ, అక్టోబరు 9 : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం కూడా కొనసాగింది. మంగళవారం 18 గ్రామాల తనిఖీకి సంబంధించిన విషయాలను వెల్లడించారు. మిగిలిన 17 గ్రామాల తనిఖీ నివేదికను బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. మండలంలోని 35 గ్రామాల్లో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు 6,60,17261 రుపాయలు ఖర్చు చేయగా, జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా పనులను పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు,గ్రామ కార్యదర్శులకు ఫైన్లు విధించారు.ఈ సమావేశంలో ఏపీడీ శ్రీపాద్, అంబుడ్స్ పర్సన్ సంతోష్‌కుమార్, డీవీఓ ప్రేమలత,ఏయం శృతి, ఎంపీడీవో యశోదమ్మలు, తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.